క్లుప్తంగా

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య



ప్రచారం చేస్తున్న కళాశాల సిబ్బంది

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామంలో మంగళవారం తమ కళాశాలలో చేరాలని కరీంనగర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యవర్ధన్‌రావు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో విద్యాబోధన, సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో లెక్చరర్లు మురళి, దివాకర్, పలువురు పాల్గొన్నారు.

బ్యాంకు ఖాతాలు అప్‌డేట్ చేసుకోవాలి

గంగాధర: బ్యాంకు ఖాతాదారులు తమ ఖాతాలను అప్‌డేట్ చేసుకోవాలని గంగాధర కేడీసీసీ బ్యాంకు మేనేజర్ సుమిత్రా అమరావతి సూచించారు. ఇందుకు ఖాతాదారులు ప్రస్తుత చిరునామా రుజువు కోసం ఆధార్‌కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ప్రభుత్వ ఉద్యోగి అయితే గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదానితో పాటు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో జూలై 31లోపు బ్యాంకులో సంప్రదించాలన్నారు. ఖాతాలు అప్‌డేట్ చేసుకోని వారి లావాదేవీలు నిలిపి వేయనున్నట్లు తెలిపారు.

ఆన్‌లైన్ క్విజ్ పోటీలు విజయవంతం చేయాలి

వీణవంక: ఈనెల 18న జరిగే రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌ను విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 16 నుంచి 35 ఏళ్లలోపు వారు ఈ పరీక్షకు అర్హులని, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు ఈనెల 17న చివరి తేదీ అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు చింతల శ్యాం సుందర్‌రెడ్డి, గడ్డం కుమార్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు అనిల్‌రెడ్డి, ప్రసాద్, కోమల్ రెడ్డి, దిలీప్, రంజిత్, మహేశ్, సురేందర్ రెడ్డి, మోహన్ రెడ్డి, భరత్, ప్రదీప్, కిశోర్, అజయ్, సాయి, సూరి, తదితరులన్నారు.

భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్ సరోజన

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామ పంచాయతీ పరిధిలోని గుడ్డి వెలుగులపల్లి గ్రామంలో సర్పంచ్ వీర్ల సరోజన ప్రభాకర్‌రావు శ్మశానవాటిక నిర్మాణానికి భూమిపూజ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పూదరి వెంకటేశ్, మాజీ సర్పంచ్ వీర్ల రవీందర్‌రావు, ఏఈ సచిన్, నాయకులు బండపల్లి శ్రీకృష్ణ, వంగరమణ, ప్రభాకర్, ఉప్పు చిలుకమ్మ, మీస వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ వార్డు కమిటీ ఎన్నిక

జమ్మికుంట: మున్సిపల్ పరిధి 6వ వార్డు హౌజింగ్ బోర్డు కాలనీలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు అధ్యక్షతన వార్డు కౌన్సిల్ శ్రీపతి నరేశ్ ఆధ్వర్యంలో వార్డు కమిటీ ఎన్నికను మంగళవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా మార్గ స్వరాజ్, ఉపాధ్యక్షుడిగా మహేందర్ రెడ్డి, అనుబంధ కమిటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్నకోటి, కౌన్సిలర్ పాతకాల రమేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు నివాళి



హుజూరాబాద్ రూరల్ : ఇటీవల రైలు ప్రమాదంలో చనిపోయిన మృతులకు మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. మృతుల కుటుంబాలను, గాయపడిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్ వాకర్స్ అధ్యక్షుడు గోవర్ధన్, మాజీ అధ్యక్షుడు రమేశ్, సభ్యులు కొన్ని రాజిరెడ్డి, కొలిపాక సారయ్య, వేల్పుల రత్నం, శ్రీనివాస్, రమేశ్, మునీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు జమయ్యేదెన్నడో?

- ధాన్యం కొనుగోళ్ల డబ్బుల కోసం రైతుల ఎదురుచూపు
- వానాకాలం ప్రారంభమైనా జమకాని డబ్బులు
- పెట్టుబడి, విత్తనాల కొనుగోళ్లకు తిప్పలు



ధాన్యం కొనుగోలు కేంద్రం (ఫైల్)

జమ్మికుంట: పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వచ్చిన ధాన్యాన్ని రైతులు అమ్ముకున్నా సకాలంలో డబ్బులు జమ కాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ధాన్యపు గింజను కొంటామని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ధాన్యం డబ్బులు అకౌంట్లో పడకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. త్వరగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసి డబ్బులు ఖాతాల్లో వేయాలని రైతులు కోరుతున్నారు.

ఖరీఫ్ సీజన్ ప్రారంభం..

గతనెల 25న రోహిణి కార్తెతో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. ఇప్పటికే పంటల కోసం పెట్టుబడులు పెట్టారు. వానాకాలంలో దుక్కులు సిద్ధం చేసుకునేందుకు విత్తనాలు కొనుగోలు చేసేందుకు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించే పరిస్థితి నెలకొంది. ధాన్యం డబ్బులు వస్తేనే పెట్టుబడి కోసం ఖర్చు చేసేందుకు రైతులు ఎదురు చూస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం ఇలా..

రాష్ట్ర ప్రభుత్వం రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లను ఏప్రిల్ 14న ఆర్భాటంగా ప్రారంభించింది. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు పడుతాయని ప్రకటించగా కొనుగోళ్ల ప్రారంభించి 53 రోజులు గడుస్తున్నా ఇంకా ఖాతాల్లో డబ్బులు పడట్లేదని వాపోతున్నారు.

అందని రైతుబంధు

ప్రతి సంవత్సరం మే నెల చివరి వారం ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పంట పెట్టుబడి సాయం అందించేది. ఈ సంవత్సరం జూన్ మొదటి వారం దాటుతున్నా ఇప్పటి వరకు రైతుబంధు అందలేదు. దీంతో రైతులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ..

పీఏసీఎస్ కేంద్రాలు		కొనుగోలు చేసిన ధాన్యం	రైతులు
జమ్మికుంట	1	37వేల క్వింటాళ్లు	745
ఇల్లందకుంట	16	82 వేల క్వింటాళ్లు	2600
తనుగుల	3	15 వేల క్వింటాళ్లు	300
ధర్మారం	2	9,600 క్వింటాళ్లు	200

పెట్టుబడికి పైసలు అందుతలేవు



ఐదెకరాల్లో వరి పంటవేశా. 109 క్వింటాళ్ల ధాన్యాన్ని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో 20 రోజుల క్రితం అమ్మాను. సీజన్ ప్రారంభమైంది. ధాన్యం డబ్బులు పడకపోవడంతో పెట్టుబడికి పైసలు అందుతలేవు.

– రామిడి మల్లారెడ్డి, మడిపల్లి, జమ్మికుంట మండలం

నెలరోజులు అవుతుంది



ధాన్యం అమ్మి నెలరోజులు అవుతుంది. 20 రోజుల కింద ఫోన్‌కు ఓటీపీ వస్తే చెప్పాను. పంటకోసం తెచ్చిన అప్పులకు వడ్డీ పెరుగుతోంది. వానాకాలం సీజన్ ప్రారంభమైంది. విత్తనాలు, పెట్టుబడికి పైసలు లేవు. ధాన్యం డబ్బులు వస్తేనే అన్ని ఖర్చులు వెళ్లదీసేది.

– పోచమ్మ, మహిళా రైతు, అబాది జమ్మికుంట

రెండ్రోజుల్లో జమవుతాయి



అకాలవర్షాలతో కొనుగోళ్లు నిదానంగా సాగాయి. రైతుల ధాన్యం కొనుగోలు వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నాం. ఖాతాల్లో డబ్బులు జమవుతున్నాయి. రెండు, మూడురోజుల్లో పూర్తిస్థాయిలో రైతుల అకౌంట్లో డబ్బులు పడుతాయి.

– ఆదిత్య, సీఈవో, ఎపీసీఎస్ ఇల్లందకుంట

‘దళిత బంధు’ నిర్వాహకుడికి అవార్డు



అవార్డు అందజేస్తున్న కలెక్టర్ ఆర్వీ కర్ణన్

జమ్మికుంట: కరీంనగర్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ అర్వీ కర్ణన్ అధ్యక్షతన నిర్వహించిన దళిత బంధు విజయోత్సవ కార్యక్రమంలో పట్టణానికి చెందిన లబ్ధిదారుడు మంద వేణుకు ఉత్తమ నిర్వాహకుడిగా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం, అవార్డును మంగళవారం అందుకున్నారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ.. దళిత బంధు అందించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పంటల మార్పిడితో అధిక దిగుబడి



మాట్లాడుతున్న కంపెనీ ప్రతినిధి సతీశ్

గన్నేరువరం: మండలంలోని జంగపల్లిలో మంగళవారం కోరమాండల్ ఇంటర్నేషనల్ కంపెనీ, డీసీఎంఎస్ నిర్వాహకులు అటికం తిరుపతి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి సతీశ్ మాట్లాడుతూ.. ఖరీఫ్ పంటల సాగులో రైతులు భూసార పరీక్షలు చేయించాలన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. సేంద్రియ ఎరువుల వాడకంతో పాటు పంటల మార్పిడిని పాటిస్తే అధిక దిగుబడులను సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అటికం రాజేశంగౌడ్, డీసీఎంఎస్ నిర్వాహకులు మ్యాదారి శ్రీనివాస్ శ్రీధర్‌రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ బుర్ర కనుకయ్యగౌడ్, సెల్స్ అఫీసర్ రాజేష్‌కుమార్, అగ్రానమిస్ట్ జగన్మోహన్‌రెడ్డి, ఎం.డీ.టీ.సీ అనిల్, రైతులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చని బీఆర్‌ఎస్



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

హుజూరాబాద్‌రూరల్ : ప్రజలకు ఇచ్చిన హామీలను బీఆర్‌ఎస్ పార్టీ నెరవేర్చలేదని బీఎస్పీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే మూతపడ్డ పరిశ్రమలను తెరిపిస్తామని చెప్పి ఇప్పటివరకు ఎందుకు తెరిపించలేదని ప్రశ్నించారు. అభివృద్ధి పనులపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. నార్త్ జోన్ మహిళా కన్వీనర్ శిరీష, మండల అధ్యక్షుడు రామ్ శ్రీనివాస్, అసెంబ్లీ కోశాధికారి కూరపాటి రామచంద్రం, మండల ప్రధాన కార్యదర్శి నీతుల కుమార్ యాదవ్, సీనియర్ బీఎస్పీ నాయకులు కండి తిరుపతి పాల్గొన్నారు.

అక్రమంగా నిర్మించిన ఇళ్లకు నోటీసులు

మానకొండూర్: మానకొండూర్ గ్రామ శివారులోని రైస్‌మిల్లులు వద్ద ఉన్న గుట్టబోరు లక్ష్మీనగర్‌లో కొందరు అక్రమంగా ఇళ్ల నిర్మించుకున్నారని, ఇళ్లకు తాళాలు వేసి ఉంటుండటంతో పాటు సరైన ధ్రువపత్రాలు సమర్పించాలని, గ్రామ పంచాయితీ ఇటీవల ఆ ఇళ్లకు నోటీసులు అందజేసింది. ఇళ్ల నిర్మించుకున్న వారినుంచి సరైన సమాధానం లేకపోవడంతో మంగళవారం సాయంత్రం గ్రామ పంచాయతీ సిబ్బంది అక్కడికి చేరుకుని ఇంట్లోని సామగ్రిని ట్రాక్టర్‌లో తరలించే ప్రయత్నం చేశారు. కవిత అనే మహిళ ట్రాక్టర్‌ను అడ్డుకొని సిబ్బందితో వాదించింది. గ్రామ పంచాయితీ సిబ్బంది నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వినకపోవడంతో తిరిగి సామగ్రిని ఆమె ఇంటి ముందు దింపివెళ్లారు. దీనిపై గ్రామ పంచాయితీ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డ్రైనేజీ పరిశీలన



డ్రైనేజీని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి 24 వార్డులో అసంపూర్తిగా నిర్మించిన నాయిని చెరువు పరిసర ప్రాంతంలోని డ్రైనేజీని మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ.. డ్రైనేజీ వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. గణేశ్ నగర్ కాకతీయ పాఠశాల వద్ద గల పత్తి మార్కెట్ వెళ్లే రోడ్డు కమాన్‌ను తొలగించి చౌరస్తాను విస్తరణ చేయనున్నట్లు తెలిపారు. రోడ్డు విస్తరణకు పట్టణ ప్రజలు సహకరించాలన్నారు. కమిషనర్ శ్రీనివాస్, సాయిని రవి, కాకతీయ విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు జలాభిషకం

చిగురుమామిడి : మండలంలోని ఓగులాపూర్‌లో గ్రామ దేవతా విగ్రహాలకు జలాభిషేకం చేశారు. బుధవారం పునఃప్రతిష్టాపన చేసే గ్రామదేవతా (బొడ్రాయి) విగ్రహాలకు మహిళలు బిందెలతో నీళ్లు తీసుకువచ్చి జలాభిషేకం నిర్వహించారు. వేద మంత్రోచ్ఛరణల మధ్య పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బోయిని శ్రీనివాస్, ఉప సర్పంచ్ కోమటిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మాజీసర్పంచ్ కోమటిరెడ్డి జయ్‌పాల్ రెడ్డి, రిటైర్డ్ ఆర్డీఓ ఈశ్వరయ్య, వార్డు సభ్యులు సంతోష్ రెడ్డి, మోహన్ రెడ్డి, మాధవ రెడ్డి, అనంత రెడ్డి, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై అభిలాష్

గంగాధర: ఎవరైన తమ సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా, ఎత్తుకెళ్లినా వెంటనే సీఈఐఆర్ ద్వారా గుర్తించవచ్చని ఎస్సై అభిలాష్ సూచించారు. మండలంలోని న్యాల కొండన్నపల్లి గ్రామానికి చెందిన నిమ్మనవేని అరుణ్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. గంగాధర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వివరాలు సీఈఐఆర్ ద్వారా ఫోన్ గుర్తించి బాధితుడికి అందజేశారు.

కాళేశ్వరం జలాలతో సస్యశ్యామలం



సాగునీటిని విడుదల చేస్తున్న జెడ్పీటీసీ రవీందర్ రెడ్డి

- జెడ్పీటీసీ మాడుగుల రవీందర్ రెడ్డి

గన్నేరువరం: కాళేశ్వరం జలాలతో మండలం సస్యశ్యామలం అవుతోందని జెడ్పీటీసీ మాడుగుల రవీందర్ రెడ్డి అన్నారు. మిడ్‌మానేరు ప్రాజెక్టు కుడి కాల్వ ద్వారా మండలంలోని ఖాసీంపేట, గన్నేరువరం, మైలారం, యాస్వాడ, మాదాపూర్, హన్మాజీపల్లె, గోపాల్‌పూర్ గ్రామాలకు సంబంధించిన ఉపకాల్వలు 8,9 లకు సాగునీటిని మంగళవారం విడుదల చేశారు. ఈసందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. రైతు సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వ కృషి చేస్తోందన్నారు. ఖరీఫ్‌లో పంటల సాగుకు ముందస్తుగా నీటిని విడుదల చేశామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతు సమన్వయ సమితి జిల్లా, మండల కో ఆర్డినేటర్లు గూడెల్లి తిరుపతి, బద్దం తిరుపతి రెడ్డి, సర్పంచులు పీచు చంద్రారెడ్డి, సహకార సంఘం డైరెక్టర్లు అటికం రవి, వెంకటరమణ రెడ్డి, నాయకులు అటికం శ్రీనివాస్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

చిగురుమామిడి: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని మండల మెడికల్ ఆఫీసర్ ధర్మనాయక్ కోరారు. మంగళవారం మండలంలోని బొమ్మనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో బాగంగా గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్లు, ఆకు కూరలు, కూరగాయలు, పాలు తీసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నపిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసాలు చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూంరెడ్డి, ఉపసర్పంచ్ శారద, ఎంపీటీసీ మల్లేశం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిర, వార్డుసభ్యులు రజిత, విజ్జగిరి, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

పారువెల్లలో...

గన్నేరువరం: మండలంలోని పారువెల్లలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. గన్నేరువరం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇశ్రాత్, అంగన్‌వాడీ టీచర్లు ప్రేమలత, సరోజన, రేణుక, పుష్పలత, ఆశావర్కర్ విజయలక్ష్మి, గర్భిణులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.



పారువెల్లలో గర్భిణులకు సీమంతం చేస్తున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్, అంగన్‌వాడీ టీచర్లు

బడీడు పిల్లల్ని బడిలో చేర్పించాలి

- మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్

ఇల్లందకుంట: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం రామన్నపల్లి, శ్రీ రాములపల్లి గ్రామాల్లో బడిబాట నిర్వహించారు. మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాఠశాలలో కల్పిస్తున్న వసతులు, విద్యాబోధన గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జి. సాంబయ్య, ఉపాధ్యాయులు వేణు, పద్మ, శంకర్, సమ్మిరెడ్డి, శ్రీదేవి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పండుగను ఘనంగా నిర్వహించాలి



సమావేశమైన ఎంపీపీ పావని

ఇల్లందకుంట: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 8న ఊరూరా చెరువుల పండుగను ఘనంగా నిర్వహించాలని ఎంపీపీ సరిగొమ్ముల పావని అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. చెరువుల వద్ద పిచ్చిమొక్కలు తొలగించి చదును చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో గుర్రం రజిత, ఎంఈవో విడపు శ్రీనివాస్, ఆర్ఐ రవి, ఏపీఎం రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం



చిన్నారికి అన్న ప్రాసన చేస్తున్న కౌన్సిలర్

హుజూరాబాద్ రూరల్ : మున్సిపల్ పరిధిలోని గణేశ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండో వార్డ్ కౌన్సిలర్ బర్మావత్ యాదగిరి నాయక్ అన్నప్రాసన కార్యక్రమం అనంతరం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తిరుమల, అంగన్‌వాడీ టీచర్, గర్భిణులు, తదితరులు పాల్గొన్నారు

23న తాడికల్ విండో చైర్మన్‌పై అవిశ్వాసం

శంకరపట్నం: ఈనెల 23న తాడికల్ సహకార సంఘం చైర్మన్ మధుకర్ రెడ్డిపై అవిశ్వాస ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు డీసీవో శ్రీమాల తెలిపారు. తాడికల్ సహకార సంఘం చైర్మన్ అవకతవకలకు పాల్పడుతున్నారని, సొంత ప్రయోజనాలకు డబ్బులు వాడుకుంటున్నారని మే 29న 9 మంది సభ్యులు డీసీవోకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు 23న అవిశ్వాసం ప్రత్యేక సమావేశం ఖరారు చేసి తాడికల్ సీఈవో వేణుమాధవతో సభ్యులకు నోటీసులు జారీచేశారు.

చీటింగ్ కేసు నమోదు

గన్నేరువరం: కరీంనగర్‌కు చెందిన సయ్యద్ ఖలీఫ్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై మామిడాల సురేందర్ తెలిపారు. గన్నేరువరంకు చెందిన నక్క దామోదర్, సయ్యద్ ఖలీఫ్‌కు 2022లో మొదట రూ.లక్ష అప్పుగా ఇచ్చారు. అనంతరం మరో రూ.7 లక్షలు ఇచ్చారు. అప్పు డబ్బులు ఇవ్వాలని కోరగా ఇవ్వకపోవడంతో నక్క దామోదర్ కోర్టును అశ్రయించాడు, దీంతో కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విత్తన దుకాణాల్లో తనిఖీ

చొప్పదండి: మండల కేంద్రంలోని విత్తన దుకాణాలను ఏవో వంశీకృష్ణ మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేశారు. నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు.వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.